క్లుప్తంగా

నియామకం

నల్లకుంట: కేసీఆర్ సేవా దళం రాష్ట్ర కార్యదర్శిగా జాలిగామ అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ అమీర్ హుస్సేన్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఆయన తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అభినందన



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన శివను ఎమ్మెల్యే ముఠా గోపాల్ తన కార్యాలయంలో అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తూ.. కుటుంబం, సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావడం శుభపరిణామమన్నారు. క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని తాను కూడా క్రీడాకారులకు అండగా ఉంటానన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఢిల్లీ టీమ్‌లో ఎంపికయ్యానని 40 రోజుల పాటు శిక్షణ పొందిన అనంతరం మలేషియాలో జరిగే అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో ఆడుతున్నట్లు తెలిపారు. బస్తీ నాయకులు దేవేందర్, కళ్యాణ్‌నాయక్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ఆర్.వివేక్, జనార్దన్ తదితరులున్నారు.

ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: జియో వివాహ పరిచయ వేదిక ఆధ్వర్యంలో అన్ని కులాల వారికి ఈనెల 23, 24 తేదీల్లో సికింద్రాబాద్‌లోని అమృతవాణి సెంటర్‌లో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.అబ్రహం ప్రకటించారు. బుధవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 8885410555, 8885073555.

గంగు భానుమూర్తికి ఘన నివాళి

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ (టీబీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత గంగు భానుమూర్తి 3వ వర్ధంతిని న్యూ నల్లకుంటలో ఘనంగా నిర్వహించారు. శివం రోడ్డులోని ఆయన విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య నివాళులర్పించారు. టీబీపీ ప్రధాన కార్యదర్శి పోచంపల్లి రమణారావు, సభ్యులు ప్రశాంత్, శిరీష, రాధిక, మురుకుంట్ల రాజేశ్వరశర్మ, సతీష్‌శర్మ, రంగారావు, లక్ష్మినర్సింహారావు, తెలంగాణ దేవాలయాల మతైక అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణశర్మ, కందూరి కృష్ణమాచారి, జగపతి, రఘుచరణ్, వాసుదేవశర్మ, హరికిషన్ తదితరులున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



అంబర్‌పేట: గణేష్ నిమజ్జనానికి చెట్ల కొమ్మలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని వైభవ్‌నగర్, సీతా కాలనీల్లో తొలగించిన చెట్ల కొమ్మలను తొలగించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ.. గణేష్ వేడుకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీజేపీ నాయకులు ఉన్నారు.

24 వరకు రేషన్ పొడిగింపు

కాచిగూడ: సెప్టెంబర్ నెల రేషన్‌ను 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల రేషన్ పంపిణీ 20 వరకే ఆఖరుగా ఉండిందని, వినాయక చవితి సందర్భంగా ప్రజా పంపిణీని మరో 4 రోజులు పొడిగించినట్లు ఆయన వివరించారు.

మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ముషీరాబాద్: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కాకుండా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని వాటిని 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ కార్యదర్శి చంద్రన్న అన్నారు. రిజర్వేషన్‌ను ఆమోదిస్తున్నప్పటికీ ఓబీసీ, మైనార్టీ సవరణతో కూడిన మహిళా బిల్లును చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అమలు చేయాలని న్యూడెమాక్రసీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుందన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ పాల్గొని మాట్లాడారు.

జైజై గణేశా.. జయములివ్వు గణేశా



కవాడిగూడలో



సిద్ధివినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



మహంకాళి ఆలయం ప్రాంగణంలో కె.దుర్గాప్రసాద్‌రెడ్డి

ముషీరాబాద్: నియోజకవర్గంలోని వివిధ మండపాల వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అపార్ట్‌మెంట్లు, కాలనీలు, బస్తీలు, ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేశారు.

అంబర్‌పేట: గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి ఆయా మండపాల వద్ద గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

నల్లకుంట: నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని శ్రీధర్ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడు బుధవారం నిమజ్జనానికై సాగర తీరానికి తరలివెళ్లాడు. చివరి రోజు ప్రముఖ ప్రవచకులు లలితవాణి, మల్లాది రామనాథశర్మ గణపతి వైభవంపై చెప్పిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మూడ్రోజుల పాటు పూజలందుకున్న లడ్డూ వేలం వేసి అనంతరం అన్నదానం చేశారు. ప్రముఖ కవి, విశ్లేషకుడు రామకృష్ణ చంద్రమౌళి, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.తిరుమల రావు, ఉపాధ్యక్షుడు విజయ్‌రామ్, సీపీరావు, సీఎస్.రావు, గిరిజ, జ్యోతి, రాధ, శ్రీలత తదితరులున్నారు.



గణనాథుడి పూజలో రామకృష్ణ చంద్రమౌళి



శివసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుషాల్‌గౌడ్



చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగేష్‌ముదిరాజ్

51 కిలోల లడ్డూ ప్రసాదం అందజేత



లడ్డూను అందజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో వినాయకచవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి అలయ మాజీ చైర్మన్ బీఎన్ శ్రీనివాస్‌యాదవ్ 51 కిలోల లడ్డూను అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. చైర్మన్ ఎం. ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు రమణమూర్తి, అరుణశ్రీ,స్వరూప, రాజాశ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా బిల్లును వ్యతిరేకిస్తున్నాం

కాచిగూడ: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును ధర్మ సమాజ్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. బుధవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు సంపూర్ణ అగ్రవర్ణ మహిళా రిజర్వేషన్ బిల్లుగా అభివర్ణించారు. ఈ బిల్లు ద్వారా అగ్రకుల మహిళలే మళ్లీ పార్లమెంట్, అసెంబ్లీలోకి ప్రవేశిస్తారన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు 90 శాతం ఉప కోటా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయం రెనొవేషన్ కమిటీ చైర్మన్‌గా బాసాని పద్మాసూర్యప్రకాష్ బుధవారం నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టారు. ఇదివరకు చైర్మన్‌గా ఉన్న గుండేపూడి మురళీప్రసాద్ ఇటీవలే మరణించారు. ధర్మకర్తగా ఉన్న బాసాని పద్మను చైర్మన్‌గా తోటి ధర్మకర్తలు ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచనల మేరకు దేవాలయ అభివృద్ధి కోసం దేవాదాయశాఖ వారు రెనొవేషన్ కమిటీని ఏర్పాటు చేసారు. ఆలయ ఈఓ ఎం.దేవనాథం, ధర్మకర్తలు జీకే రమణ, మురికి గణేష్, ఆలయ పూజారి బుగ్గా లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, ఆచారి, భక్తులు పాల్గొన్నారు.

పేద దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేత

చిక్కడపల్లి: శ్రీ సాధుమార్గి జైన్ సంఘం, భగవాన్ మహవీర్ వికలాంగుల కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తా సమతాభవన్‌లో పేద దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ప్రమాదాలు, షుగర్ వ్యాధితో కాళ్లు కోల్పోయిన 22 మందికి ఉచితంగా కృతిమ కాళ్లను అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాలకు చెందిన వారు ఈ శిబిరంలో పాల్గొనగా.. వారికి కృత్రిమ అవయవాలను తొడిగారు. శాసన్ దీపక్ విదేహ మురాజి గురువు ఎదుట వ్యసనాలను వదిలేస్తామని ప్రమాణం చేశారు. శ్రీ సాదుమార్గి జైన్ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు రాజేష్ రాంకా పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నల్లకుంట: పాల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఎస్సై కె. రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో హౌజ్ కీపింగ్ పనిచేస్తున్న గుజ్జుల తార కుటుంబ సభ్యులతో కలిసి నల్లకుంట విజ్ఞానపురి కాలనీలో నివాసం ఉంటుంది. ఆమె కుమారుడు గుజ్జుల హరిశంకర్ (43) స్థానికంగా పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. కాగా రోజులాగే ఈ నెల 15న ఉదయం 4 గంటలకు పాల కేంద్రానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తల్లికి ఇంట్లో కుమారుడు కనిపించలేదు. కుమారుడి మొబైల్‌కు ఫోన్ చేయగా.. నాట్ రీచబుల్ రావడంతో స్నేహితులు, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో పరువురికి జైలు..

అనుమానాస్పదంగా సంచరిస్తూ..

ముషీరాబాద్: మొహానికి ముసుగు ధరించి అర్ధరాత్రి అనుమానాస్పదంగా రోడ్లపై సంచరిస్తున్న ఓ వ్యక్తిని ముషీరాబాద్ వివరాలు అడగగా.. సరైన సమాధానం చెప్పకపోవడంతో సదరు వ్యక్తిని పోలీస్టేషన్‌కు తీసుకొచ్చి పోలీసులు విచారించారు. అనుమానితుడు వినోద్‌కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా.. జడ్జి అతడికి 30 రోజుల జైలుశిక్షను విధించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి..

ముషీరాబాద్: రాంనగర్‌కు చెందిన ఎండీ సల్మాన్ ప్రైవేటు ఉద్యోగి. కాగా అతడు ఓ మహిళతో అసభ్యంగా ప్రవరిస్తూ.. ఆమెతో గొడవపడి చేయి చేసుకున్నందుకు ఆమె ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా.. అతడికి 20 రోజుల జైలుశిక్ష విధించారు.

మహిళతో ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడిన వ్యక్తికి..

ముషీరాబాద్: ర్యాపిడో బైక్‌బుక్ చేసుకున్న మహిళతో ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన బైక్ డ్రైవర్ వీ.టీ.ఎస్.రాజుపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు చేయగా.. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా.. జడ్జి అతడికి 16 రోజులు జైలు శిక్ష విధించారు.

మహిళా నర్సుతో అసభ్యంగా ప్రవర్తించిన డాక్టర్‌కు..

ముషీరాబాద్: గాంధీనగర్‌లోని ఓ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న చిలుపురి హరీష్ అదే ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సుపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు డాక్టర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా.. నిందితుడికి 8 రోజుల జైలుశిక్ష విధించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురికి..



నిందితులు

ముషీరాబాద్: బైక్‌పై వెళ్తున్న మహిళతో పక్కనే మరో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు మహ్మద్ ఖలీల్, మహ్మద్ అబ్దుల్లా, మహ్మద్ ఇబ్రహీంలు అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో బాధితురాలు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా.. ముగ్గురు నిందితులకు 8 రోజుల జైలుశిక్ష విధించారు.

నేడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

కాచిగూడ: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి సందర్భంగా నేడు ఉదయం 9 గంటలకు జలదృశ్యం వద్ద ఉన్న బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ప్రకటించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాగుల శ్రీనివాస్‌యాదవ్, సుధా నాగేందర్, అశోక్, బండారి పద్మావతి, దుర్గేష్, రాధాకృష్ణ, కొత్తపల్లి బాయమ్మ, బండారి వైద్యనాథ్, అకాశ్ తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ ధర్నా

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ.. బుధవారం హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కిషన్‌రెడ్డి కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోతే దీనికి కిషన్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ హెచ్చరించారు. మాదిగల ఆవేదనను కేంద్రానికి వినిపించడంలో కిషన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఇనుముల నర్సయ్య మాదిగ, రాగళ్ల ఉపేందర్ మాదిగ, కొమ్ము శేఖర్, గణేష్ తదితరులున్నారు.

మతసామరస్యాన్ని కాపాడుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మతసామరస్యాన్ని ప్రతి ఒక్కరు కాపాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీ.వీ.ఆనంద్ అన్నారు. బుధవారం రాత్రి చిక్కడపల్లిలోని వినాయక మండపాల వద్ద జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మతపరమైన హక్కు రాజ్యాంగం కల్పించిందని ఎవరికి విఘాతం కలగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో అందరూ కలిసిమెలిసి పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వహకులు, బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, సీఐ నరేష్, కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: ప్రముఖ నటుడు పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి సందర్భంగా ప్రముఖ సాంస్కృతిక సంస్థ రాగ సప్తస్వరం, తిరుమల గ్రూప్స్ ఆఫ్ కో- ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ నంగునూరి చంద్రశేఖర్ సహకారంతో వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు ఈనెల 27న శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై రజత పతకాలు ప్రదానం చేస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం చిక్కడపల్లిలో నంగునూరి చంద్రశేఖర్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: ఉద్యమ నాయకుడిగా ఎదిగి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ సీఎం కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించడం సరికాదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి రూ.10వేల కోట్లతో ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమం అంశాన్ని చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పి.సుదర్శన్‌రెడ్డి, గంగా సురేష్, పి.శ్రీనివాస్‌గౌడ్, ఐలయ్యయాదవ్, చారి, నరేందర్‌గౌడ్, విష్ణువర్ధన్, మహేశ్వర్ రెడ్డి, సందీప్, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



ఆకాశ్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో కాలంచెల్లిన పైపులైన్ వ్యవస్థను దశలవారీగా ఆధునీకరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ ఆకాష్‌నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకనుగుణంగా పైపులైను వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రోడ్లు, పార్కులు, పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు. జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, యాసీన్, మహేష్ ముదిరాజ్, రాజు తదితరులున్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్

కాచిగూడ: బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం బుధవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను ఢిల్లీలో కలిసి బీసీల సమస్యలపై చర్చించారు. అనంతరం బీసీల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు గుజ్జ కృష్ణ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.2లక్షల కోట్లకు పెంచాలని, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పథకం దేశమంతటా అమలు చేసేలా సిఫారసు చేయాలన్నారు. రాజ్యాంగబద్ధమైన మండల్ కమిషన్ బీసీల అభివృద్ధికి చేసిన సిఫార్సులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 27శాతం రిజర్వేషన్లు పెట్టారని, వీటికి అనుబంధంగా ఆర్థికపరమైన రాయితీలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజుల మంజూరు, హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలలు, మంజూరుకు బడ్జెట్ కేటాయించడం లేదన్నారు. బీసీల కోసం ప్రత్యేక హాస్టళ్లు, విద్యాసంస్థలు లేకపోతే బీసీలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్‌సాగర్, తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ తదితరులున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యపరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ రెడ్డి

కాచిగూడ: 'ఆయుష్మాన్ భవ' ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. బుధవారం ఉచిత వైద్య శిబిరంలో ఆయన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. 'ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్' ద్వారా ఉచిత మందులతో పాటు వ్యాధి నిర్ధారణ సేవలు, ఔట్ పేషెంట్ సేవలు, టెలి కన్సల్టేషన్, యోగా, వెల్‌నెస్ సెషన్లు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ తదితర సేవలను అందిస్తున్నామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ నర్సుబాయి, స్టాఫ్ నర్సు కీర్తిలత, హేమ తేజస్వీ, ఉషశ్రీ, కవిత, ఏఎన్ఎంలు ఇందిర, రాధ, పద్మ, సుహాసిని, జయ, సునిత, ఆశావర్కర్లు మాధవి, పుష్ప, అమరావతి, అనురాధ, లలిత, ఉమ, శ్రీదేవి, సబిత, జమున, లావణ్య, మహానందదేవి, లికిత, సుజాత, వనజ, రత్నమాల, మహేశ్వరి, లావణ్యలు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజానికి స్వచ్ఛభారత్ దోహదం



పటేల్‌నగర్ స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న గౌతమ్‌రావు

అంబర్‌పేట: స్వచ్ఛభారత్ దేశ ప్రతిష్టను పెంపొందించటానికి దోహదపడిందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.గౌతమ్‌రావు అన్నారు. ఈనెల 17న ప్రధాని జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు బుధవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో నిర్వహించామన్నారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణానికి దోహదపడుతుందన్నారు. బీజేపి పార్టీ ప్రజల ఆకాంక్షలు నేరవేర్చేందుకు సిద్ధాంతపరంగా కృషి చేస్తుందన్నారు. బీజేపీ నాయకులు నాగభూషణంచారి, ఆనంద్‌గౌడ్, బిక్షపతి తదితరులున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం



కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళాబిల్లును ప్రవేశపెట్టడం చరిత్రాత్మకమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద ప్రధాని చిత్రపటానికి మహిళలతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనేక దశాబ్దాల నుంచి మహిళాబిల్లు కోసం ప్రయత్నించినా కాంగ్రెస్ పార్టీ ఏ రోజు అమలు చేసే ధైర్యం చేయలేదని విమర్శించారు. కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, వై.అమృత, బీజేపీ మహిళా ప్రతినిధులు జ్యోతి, రమ్య, నీరజ, సంధ్య, విశాలాక్షి తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్లతో కూడిన మహిళా బిల్లును ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న బాలరాజుగౌడ్, వెంకన్నగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజరేషన్ బిల్లులో బీసీ రిజర్వేషన్‌తో కూడిన మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వాయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... చిత్తశుద్ధిలేని బిల్లులు ప్రవేశపెట్టడం వల్ల అణగారిన వర్గాల వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఇప్పుడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే అమలు చేయాలన్నారు. రిజర్వేషన్ లేని ఈ బిల్లుతో అగ్రకుల మహిళలే చట్టసభల్లో తిష్టవేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.